క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అమరావతి నగర్, వెంకటేశ్వర కాలనీ, శ్యామల గార్డెన్, ప్రగతినగర్, రెవెన్యూ కాలనీ, రామకృష్ణ కాలనీ, నాగేంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నక్కలగుట్ట, భవాని నగర్, వినాయకనగర్, గోకుల్‌నగర్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, రాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరి పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ మ్యాక్రో ఎకనామిక్ వేరియబుల్స్ ఆఫ్ ఇండియన్ స్టాక్ మార్కెట్ – ఏ స్టడీ సెలెక్ట్ సెక్టార్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు అర్షియా సుల్తానాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. కామర్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో సుల్తానా తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, చెరబండరాజు నవలలు – కథలు తెలంగాణ జనజీవనం అనే అంశంపై తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయని పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథానికి పరిశోధకుడు సంపత్‌రెడ్డికి డాక్టరేట్ అందజేసినట్లు నర్సింహాచారి వివరించారు. వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంపత్‌రెడ్డి తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షర్ఫొద్దీన్ వసీం.. తరుచిరాపల్లి ఎన్ఐటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఎన్ఐటీ తిరుచిరాపల్లి డైరెక్టర్ ప్రొఫెసర్ ఆగిల డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఎం.బృంద పర్యవేక్షణలో 'టెక్స్ డిటెక్షన్ ఫ్రమ్ నేచురల్ సీన్ ఇమేజెస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ప్రిన్సిపుల్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వసీంకు డాక్టరేట్ అందజేశారు.

చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించండి

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని చిన్న వడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ కోరారు. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు, మట్టెవాడలోని కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, భద్రకాళి చెరువు, తిమ్మాపూర్‌లోని బెస్తం చెరువు, రంగశాయిపేటలోని దామెర చెరువు, గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు, ఖిలా వరంగల్‌లోని అగడ్తల, కాజీపేటలోని బంధం చెరువుల్లో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి నీరు కలుషితమవుతోందని పేర్కొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి



హసన్‌పర్తి: నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఒకటోడివిజన్ ముచ్చర్లలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రాజేష్, కుమార్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శ్రవణ్, సతీష్, ధర్మారెడ్డి, ఐలయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ టి.సంజయ్ తెలిపారు. 56ఏళ్ల భాగ్యమ్మకు మెదడు పొరల్లో రక్తస్రావం జరిగినట్లు నిర్ధారించి న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ప్రియాంక, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ టీం డాక్టర్ ప్రదీప్ రాజన్న, డాక్టర్ లక్ష్మి దీపక్ ఆధ్వర్యంలో చికిత్స చేసినట్లు సంజయ్ వివరించారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

వరంగల్: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఒక్కరికే రుణమాఫీ!

- ఇంకా 1,011మంది రైతుల ఎదురుచూపు
- పెగడపల్లి సొసైటీ ఆడిట్ నివేదిక అందజేయకపోవడమే కారణం

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకం అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు అందకుండా పోతోంది. హసన్‌పర్తి మండలం పెగడపల్లి ప్రాథమిక సహకార సొసైటీలో కేవలం ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తించింది. ఈ సొసైటీ పరిధిలో 1,012 మంది రైతులు ఉన్నారు. వారు రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు రుణాలు పొందారు. సొసైటీ పరిధిలో సుమారు రూ.9.5కోట్లు మాఫీ కావాల్సిఉంది. సొసైటీ పరిధిలోని సభ్యులందరు రుణాలు పొందారు. మొదటి విడతలో పల్లం సతీష్ అనే రైతు పేరు మాత్రమే రుణమాఫీ జాబితాలో ఉంది. ప్రస్తుతం ఈ సొసైటీ వాణిజ్య బ్యాంక్ పరిధిలో కొనసాగుతోంది. రెండవ విడతలోనూ ఎవరికీ రుణమాఫీ కాలేదు.



ఆన్‌లైన్‌లోని వివరాలు

'ఆడిట్' నివేదించకపోవడమే కారణం

వాణిజ్య బ్యాంక్‌కు అనుబంధంగా ఉన్న పెగడపల్లి సొసైటీతో పాటు పలు సహకార సంఘాలు సరైన సమయంలో ఆడిట్ నివేదికను నివేదించకపోవడమే కారణమని రైతులు అభిప్రాయపడుతున్నారు. రుణమాఫీ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మూడవ విడత తర్వాత ఈ సొసైటీకి నిధులు విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు.



పెగడపల్లి సొసైటీ భవనం

అధికారుల నిర్లక్ష్యంతోనే..



అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు రుణమాఫీ వర్తించలేదు. అధికారులు సకాలంలో ఆడిట్ నివేదికను సమర్పించకపోవడంతోనే ఇలా జరిగింది. పెగడపల్లి సొసైటీకి సంబంధించిన రుణమాఫీ జాబితాను ప్రదర్శించలేదు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

– మ్యాదరబోయిన కమలాకర్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్

9, 10, 11వ తేదీల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఖిలా వరంగల్: ఈనెల 9, 10, 11వ తేదీల్లో వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని మైసమ్మ తల్లి, పోతలింగన్న స్వామి గుడిలో విగ్రహాలు, శిఖర కళ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి వొగిలిశెట్టి అనిల్‌కుమార్ తెలిపారు. కరీమాబాద్ రోడ్డులోని మున్నూరు కాపు భవనంలో బుధవారం జరిగిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న ఉదయం హోమం, సాయంత్రం విగ్రహాలకు జలాదివాసం, 10న ఉదయం పురవీధుల్లో మైసమ్మ, పోతలింగన్న స్వామి విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం ధాన్య దివాసం, పుష్పాదివాసం, 11న ఉదయం 7.38 నిమిషాలకు యంత్ర విగ్రహాల ప్రతిష్ఠాపన, సాయంత్రం 4గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, పూజాది కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గోనెల రాంప్రసాద్, కొమ్మిని రాజేందర్, కోదాటి శ్యాంసుందర్, కోరె కృష్ణ, మెడిది మధుసూదన్, శివమూర్తి, వొగిలిశెట్టి సంజీవ్, రాముల బాబు, వొగిలిశెట్టి ప్రవీణ్, సంతోష్‌కుమార్, వేముల రాధాకృష్ణ, గడ్డం రమేష్, మాటేటి నరేందర్, వెంకటస్వామి, సంపత్, కొమ్మిని సురేష్, వంగరి సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్ అనుగుణంగా నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

వరంగల్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ అంబేడ్కర్ అభయ హస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపు మేరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ ఎక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్‌నిర్మాణం, తదితర అంశాలకు రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ: ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

న్యాయవాదుల ఫిర్యాదుపై కేసు నమోదు

పోలీసులు, న్యాయవాదుల మధ్య జరిగిన వివాదంలో న్యాయవాదులు ఇచ్చిన ఫిర్యాదుపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులపై కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



వరంగల్: మాట్లాడుతున్న కుసుమ సతీష్

వరంగల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్ ఆధ్వర్యంలో వరంగల్‌లో కొత్తవాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నాయకులు ప్రదీప్‌రావు, రత్నం సతీష్, వెంకటరమణ, హరిశంకర్, శ్యాంసుందర్, కూచన క్రాంతికుమార్, చిలువేరు రాజేందర్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కందిమల్ల మహేష్ పాల్గొన్నారు.

వరంగల్: చేనేతపై కేంద్రం జీఎస్టీ రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత బంధు ప్రకటించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. కొత్తవాడలో జరిగిన కార్యక్రమంలో కూచన సారయ్య, రామకృష్ణ, శంకర్, సారయ్య, రమేష్, శంకరయ్య, భిక్షపతి, కిశోర్, మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగంపై చిన్నచూపు

హసన్‌పర్తి: చేనేత రంగం పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం అన్నారు. హసన్‌పర్తి చేనేత సహకార సంఘంలో జరిగిన కార్యక్రమంలో నాయకుడు వైద్యం రాజ్‌గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి సట్యూరి సంతోష్, ప్రచార కార్యదర్శి రాజేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి చేనేతను బతికించాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ కోరారు. వరంగల్ శివనగర్‌లో గుండు సోమేశ్వర్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్, బైరి శ్యాంసుందర్, అనుమంతుల కిరణ్, శ్రీధర్, పెద్దూరి పెద్దన్న, సుభాష్, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

రామన్నపేట: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ ఝెలుగం లీలావతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కొత్తవాడలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ నాయకులు చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, మొగిలి, రావుల రాజీవ్, అక్బర్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళన చేస్తున్న మాల కులస్తులు

కాజీపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం సభ్యులు కాజీపేట చౌరస్తాలో బుధవారం ఆందోళన చేశారు. సంఘం నగర అధ్యక్షుడు మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు రహదారిపై బైటాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలకు స్వస్తి చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ సభ్యుడు కోంద్ర నర్సింగరావు, సీహెచ్.కొమ్మాలు, పి.గోవర్ధన్, బండి రాంచందర్, పోతుల సాంబయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సఖి సెంటర్‌తో తక్షణ రక్షణ



హసన్‌పర్తి: ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు.. సఖి కేంద్రాన్ని ఆశ్రయిస్తే తక్షణ రక్షణ అందించనున్నట్లు సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి తెలిపారు. హసన్‌పర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు సఖి సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న అధ్యక్షతన జరిగిన సదస్సులో శ్రీదేవి మాట్లాడారు. సఖి సెంటర్ 24 గంటల పాటు సేవలు అందిస్తోందని తెలిపారు. బాధితులు 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ వినీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు తెలుగు దినపత్రికల జర్నలిస్టుల సంఘం ఏర్పాటు

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో వివిధ తెలుగు దినపత్రికల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శివనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా ఆలువాల సదాశివుడు, కో కన్వీనర్లుగా కొత్త రమేష్, బజ్జూరి ప్రభాకర్, కర్నెస్వామి చిన్నబాబు, మైదం వెంకన్న, బాదావత్ బాలాజీ, ఈద శ్రీనాథ్, ఈర్ల సురేందర్, మేరుగు అశోక్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వి.రాంచందర్, బి.శ్రీనివాస్, ఎం.రాజేంద్రప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాస్, కె.రమేష్, టి.నరేష్, ఆర్.ఉపేందర్, ఎండి.జాఫర్, పి.వేణు, భరత్, బి.కిరణ్, ఆర్.నరేష్, పి.నర్సయ్య, జర్నలిస్టులు పాల్గొన్నారు.

శ్రావణ మాస బోనాల వేడుకలు



ఖిలా వరంగల్: బోనంతో మహిళలు



వరంగల్ చౌరస్తా: పూజలు చేస్తున్న భక్తులు

ఖిలా వరంగల్: శ్రావణ మాసం సందర్భంగా వరంగల్ శంభునిపేటలోని పోచమ్మ దేవాలయంలో బుధవారం సాయంత్రం శాలివాహనాల బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయాల అభివృద్ధి కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కందికొండ మక్షహస్, కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామి, జనార్దన్, చక్రపాణి దర్శి ప్రకాశ్, ముఖేష్ శరత్‌చంద్ర, వీరమ్మ, రాజమణి, భాగ్య పాల్గొన్నారు.

వరంగల్ స్టేషన్ రోడ్డులో..

వరంగల్ చౌరస్తా: శ్రావణ మాసం సందర్భంగా వరంగల్ స్టేషన్ రోడ్డులోని పోచమ్మతల్లికి గిర్మాజీపేటకు చెందిన కుమ్మరులు బుధవారం బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, కుమ్మర సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



నయీంనగర్: పోచమ్మకుంటలో..

పోచమ్మకుంటలో..

నయీంనగర్: 54వ డివిజన్ పోచమ్మకుంటలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, 53వ డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్, సంఘం నాయకులు కందికొండ వేణుగోపాల్, అశోక్, శ్రీను, నరెడ్ల శ్రీధర్, జనార్దన్ పాల్గొన్నారు.

పరిశోధనలో పారదర్శకతే ప్రామాణికం



విస్తృతోపన్యాసం చేస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

కేయూ క్యాంపస్: పరిశోధనల్లో పారదర్శకతే ప్రామాణికమని, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి సూచించారు. కేయూలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ఎం విభాగంలో పరిశోధకులకు బుధవారం నిర్వహించిన విస్తృతోపన్యాసంలో సామాజిక శాస్త్రాల పరిశోధన, స్వభావం, ప్రాముఖ్యత అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సామాజిక శాస్త్రాల పరిశోధనలు క్లిష్టమైనవని, మానవ ప్రవర్తన సరళిని అంచనా వేయడం వంటి వాటితో కొంత ఇబ్బంది తప్పదని చెప్పారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాస్‌రావు, బీఓఎస్ ప్రొఫెసర్ యాదగిరిరావు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బండి శ్రీను పాల్గొన్నారు.

మండల్ సిఫార్సులు అమలు చేయాలి



మండల్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: ఇతర వెనుకబడిన తరగతుల సమగ్రాభివృద్ధి కోసం మండల్ కమిషన్ రిపోర్టు సిఫార్సులను అమలు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బిందేశ్వరి ప్రసాద్ మండల్ డేను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 57శాతం ఉన్న ఇతర వెనుకబడిన తరగతుల కోసం నాడు మండల్ కమిషన్ తన రిపోర్టులో 40 సిఫార్సులు చేస్తే ప్రభుత్వాలు కేవలం రెండు సిఫార్సులను మాత్రమే అమలు చేస్తున్నాయని విమర్శించారు. తొలుత మండల్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కాజీపేట జంక్షన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎంప్లాయిస్ ఓబీసీ అసోసియేషన్ కార్యాలయంలో మండల్ డే ఉత్సవాలు నిర్వహించారు. అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ అధ్యక్షుడు చంద్రమౌళి, కాజీపేట, వరంగల్ ఓబీసీ నాయకులు సుదర్శన్‌రావు, రాజ్‌కుమార్, కుమారస్వామి, కంచు రాజు, రాజశేఖర్, రాజేశ్వర్‌రావు, సీహెచ్.రాజు, వెంకటరాజం, మహేందర్, వీర్రాజు, రాజకుమార్, సతీష్, వీరాచారి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

హన్మకొండ అర్బన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) హనుమకొండ జిల్లా కన్వీనర్ మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా నాయకులతో కలిసి హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రజలను సర్కారు మోసం చేసిందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌రెడ్డి రాజేంద్ర, గడ్డం సుధారాణి, బండారి మమత, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం పవిత్రోత్సవాల ముగింపు, ఆండాళమ్మ తిరునక్షత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి, 108 కలశాలు, సుగంధ ద్రవ్యాలు, పాలు, పెరుగు, పళ్ల రసాలతో స్వామి వారికి, ఆండాళమ్మకు, రామానుజులకు అభిషేకం చేశారు. మహిళలు సాయంత్రం సామూహిక కుంకుమ అర్చనలు చేశారు. కార్యక్రమంలో పవిత్రోత్సవ సేవా సమితి అధ్యక్షుడు గుమ్మడవెల్లి అశోక్, ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

'ప్రోగ్రెస్'లో మాస్టర్ చెఫ్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు బుధవారం మాస్టర్ చెఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిసాలిక్ ఇంటర్నేషనల్ సిలబస్ ప్రకారం చిన్నారులకు క్యారెట్, దోస, టమాటో, కెచప్, బ్రెడ్‌ను ఉపయోగించి సాండ్విచ్ తయారు చేసి చూపించినట్లు స్కూల్ కరస్పాండెంట్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. స్కూల్ డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, ఉపాధ్యాయులు ప్రశాంతి, గీత, సుజాత, మానస, అలేఖ్య పాల్గొన్నారు.

మెట్టుగుట్టలో సిరిసిల్ల రాజయ్య పూజలు

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య బుధవారం దర్శించుకున్నారు. శివాలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయనను అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి, శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, నాయకులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట: రెండు రోజులుగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మార్చురీలో భద్రపరినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని కోర్టు ఆవరణలో మంగళవారం స్పృహ తప్పి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని సంతోష్ అనే వ్యక్తి చూసి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు బతికించడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సదరు వ్యక్తి బుధవారం తుది శ్వాస విడిచాడు. మృతుడి వివరాలకు 87126 85008, 87126 85122 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్: వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, ముస్కమల్ల అరుణ, మరుపల్లి రవి, బోగి సువర్ణ, బైరబోయిన ఉమ సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వరంగల్ 33, 34, 37, 38వ డివిజన్లలో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో బైరబోయిన దామోదర్, బోగి సురేష్, ముస్కమల్ల సుధాకర్, బిల్లా రాజు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

హన్మకొండ కల్చరల్: ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భద్రకాళి దేవాలయ ఆవరణలో మట్టెవాడ పోలీసులు, దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం పూల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు, ఆలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, సీఐ తుమ్మ గోపి, కేఎంసీ ఫిజికల్ డైరెక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్ కాలనీలో స్వచ్ఛదనం – పచ్చదనం

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్ కొండా పటేల్ కాలనీ ఎల్బీఆర్ నగర్‌లో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సురేష్, స్పెషల్ ఆఫీసర్ ఫణి కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి, శానిటరీ జవాన్లు, ఆర్పీలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

హన్మకొండ అర్బన్: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 49వ డివిజన్‌లో ప్రకాష్‌రెడ్డిపేట చర్చి మలుపు వద్ద గుంతమయంగా ఉన్న రోడ్లకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస ఆధ్వర్యంలో కంకర పోసి చదును చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

హసన్‌పర్తి: వయో వృద్ధులకు సాధారణంగా వచ్చే వ్యాధులకు ఆయుర్వేద వైద్య విధానం ద్వారా సులువైన చికిత్స అందుతోందని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకురాలు డాక్టర్ ప్రమీలాదేవి తెలిపారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని విద్యారణ్యపురి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.